AKSHARA TODAY


# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAYNEWS.COM

19-8-2026 (Wednesday) MAIN EDITION

## ఆలయాల్లో వివక్షకు తావులేదు



**అక్షరటుడే, తమిళనాడు:** ఆలయాల్లో కుల వివక్షకు తావు లేదని మద్రాస్ హైకోర్టు స్పష్టం చేసింది. కాంచీపురంలోని అరుల్మిగు దేవరాజ స్వామి ఆలయంలో బ్రాహ్మణేతర భక్తుల పట్ల వివక్ష చూపుతున్నారన్న ఆరోపణలపై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. భక్తులపై వివక్ష చూపడానికి మతపరమైన సంప్రదాయాలను సాకుగా వాడకూడదని న్యాయమూర్తులు జి. జయచంద్రన్, ఇ. మనోహరన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. దేవుని దృష్టిలో జీవులందరూ సమానమే, ఆయన ఎటువంటి వివక్ష చూపరని కోర్టు తెలిపింది.

## ఈడీ విచారణకు హాజరైన నిధి అగర్వాల్




**అక్షరటుడే, సినిమా డెస్క్** : హీరోయిన్ నిధి అగర్వాల్ బుధవారం ఈడీ విచారణకు హాజరు అయ్యారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ వ్యవహారంలో ఈడీ ఆమెను ప్రశ్నించింది. నిధి బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసి, హవాలా ద్వారా డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ డబ్బులను లెక్కల్లో చూపించలదేని ఈడీ అభియోగాలు నమోదు చేసింది. ఈ మేరకు ఆమెను తాజాగా విచారించింది.

## జగన్‌కు రాజకీయాలు అవసరమా



అక్షరటుడే, ఏపీ: శాసనసభ సమావేశాలను వైఎస్సార్‌సీపీ బహిష్కరించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు మండిపడ్డారు. అసెంబ్లీని ఒక పార్టీ పూర్తిగా బహిష్కరించడం తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఏనాడూ చూడలేదన్నారు. ప్రజాస్వామ్యాన్ని చులకన చేస్తున్న జగన్‌కు అసలు రాజకీయాలు అవసరమా అన్నారు.

## ప్రిన్సిపాల్‌ను చంపింది విద్యార్థులే..



అక్షరటుడే, నల్గొండ : నల్గొండ జిల్లా కొండమల్లేపల్లిలోని నాగార్జున స్కూల్ ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య కేసులో విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి. పాఠాలు చెప్పిన గురువును, డబ్బుల కోసం ఇద్దరు పదో తరగతి విద్యార్థులు దారుణంగా కత్తితో పొడిచి చంపినట్లు పోలీసులు తేల్చారు.

## తమ్ముడి పలకరింపు కోసం ఎదురుచూస్తున్నా..



అక్షరటుడే, ఏపీ : కోట్లాది మంది ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించే ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందం ఇంట్లో ప్రస్తుతం భావోద్వేగ వాతావరణం నెలకొంది. తనను కనీసం పట్టించుకోవడం లేదంటూ ఆయన సొంత అన్నయ్య శ్రీవదన్ చేసిన భావోద్వేగ వ్యాఖ్యానాలు రెండు తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారాయి.



# హరీశ్ రావు హౌస్ అరెస్ట్

సనత్‌నగర్‌లోని టిమ్స్ ఆస్పత్రిని పరిశీలించేందుకు వెళ్లాలని నిర్ణయించుకున్న బీఆర్ఎస్ అగ్రనేతలను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. మాజీ మంత్రులు తన్నీరు హరీశ్ రావు, సబితా ఇంద్రా రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులను పోలీసులు కట్టడి చేసి, ఆస్పత్రికి వెళ్లకుండా అడ్డుకున్నారు.

**- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**

■ టిమ్స్ పరిశీలనకు వెళ్లకుండా అడ్డగింత ■ ఆగ్రహం వ్యక్తం చేసిన మాజీ మంత్రి

సనత్‌నగర్ టిమ్స్ ఆస్పత్రికి వెళ్లకుండా మాజీ మంత్రి హరీశ్ రావును నిరోధించేందుకు కోకాపేటలోని ఆయన నివాసం వద్ద పోలీసులు భారీగా మోహరించారు. హౌస్ అరెస్ట్ విషయం తెలుసుకున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆయన నివాసానికి చేరుకోవడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మరోవైపు, సనత్‌నగర్ టిమ్స్ ఆస్పత్రి సందర్శనకు బీఆర్ఎస్ నేతలకు ఎలాంటి అనుమతి లేదంటూ పోలీసులు దౌర్జన్యంగా అడ్డుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

### హరీశ్ రావు ఫైర్..

పోలీసుల అక్రమ నిర్బంధాలు, హౌస్ అరెస్టులపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా మండిపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలు, ఆస్పత్రుల్లోని డొల్లతనం ఎక్కడ బయటపడతాయోనన్న భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అరెస్టులకు పాల్పడుతోందని ఎద్దేవా చేశారు. ప్రజా సమస్యలపై నిలదీస్తే హౌస్ అరెస్టులు చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అప్రకటిత ఎమర్జెన్సీని అమలు చేస్తూ, పోలీసుల నిర్బంధాలతో ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇండ్ల మీదకు పోలీసులను పంపి ఎందుకు దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నారని మండి పడ్డారు.

### లంచం తీసుకోమంటున్నారు

హరీశ్‌రావును తెలంగాణ భవన్‌లో లైసెన్స్‌డ్ సర్వేయర్లు కలిశారు. తమ సమస్యలను ఆయనతో చెప్పుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. జీతాలే ఇవ్వకుండా అది ఉద్యోగం ఎలా అవుతుందని ప్రశ్నించారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లకు జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీతాల కోసం ఐఏఎస్ లోకేష్ కుమార్ దగ్గరికి వెళ్లి అడిగితే రైతుల దగ్గర లంచం తీసుకోమని చెబుతున్నాడు అంట అన్నారు. ఒక ఐఏఎస్ అధికారి అయి ఉండి అలా మాట్లాడొచ్చా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీతం రాదు, హెల్త్ ఇన్సూరెన్స్ స్కీం లేదు, ట్రావెల్ అలవెన్స్ లేదు.. పెట్రోల్ ఖర్చు ఎక్కువ, సర్వే చేస్తే వచ్చేది తక్కువ అన్నారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లకు తమ పార్టీ అండగా ఉంటుందన్నారు.

## కవిత ఇంట్లో విజయ్ జ్యోతిష్యుడు




**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** మాజీ ఎమ్మెల్సీ, టీఆర్ఎస్ చీఫ్ కవిత పార్టీని మరింత బలోపేతం చేసేందుకు శ్రమిస్తున్నారు. వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటూ, ప్రజా సమస్యలపై గళం వినిపిస్తున్నారు. ఈ క్రమంలో తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ వ్యక్తిగత జ్యోతిష్యుడిగా పేరుగాంచిన రిక్కీ రాధన్ పండిట్ వెట్రివేట్... నేరుగా కవిత నివాసానికి వచ్చి ఆమెను కలవడం రాజకీయ వర్గాలలో చర్చనీయాంశమైంది. ఈ భేటీకి సంబంధించి కవిత, ఆమె కుమారుడు రిక్కీ రాధన్‌తో కలిసి దిగిన ఫొటో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

## భారత్ ఘన విజయం



**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్ :** శ్రీలంకతో జరిగిన తొలి టెస్టులో భారత్ విజయం సాధించింది. 372 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన లంక జట్టు 206 పరుగులకే ఆలౌటైంది. దీంతో 165 పరుగుల తేడాతో భారత్ గెలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 462 పరుగులు చేసింది. అనంతరం శ్రీలంకను 284 పరుగులకు కట్టడి చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 193 పరుగులకే ఆలౌట్ అయింది. 372 పరుగుల టార్గెట్‌తో బరిలోకి దిగిన లంక 206 పరుగులు మాత్రమే చేసింది. భారత బౌలర్ మానవ్ సుతార్ తొలి ఇన్నింగ్స్‌లో 4, రెండో ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు తీశాడు.

## గ్రూపు రాజకీయాలతోనే పదవులు రాలేదు




**అక్షరటుడే, హైదరాబాద్:** గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ బీజేపీ రాష్ట్ర నేతలపై విమర్శలు చేశారు. తెలంగాణ బీజేపీ నాయకులు గ్రూప్ రాజకీయాలు చేయడంతోనే జాతీయ కార్యవర్గంలో చోటు దక్కలేదన్నారు. ఈ మేరకు ఆయన వీడియో విడుదల చేశారు. బీజేపీ జాతీయ నాయకత్వం ఇటీవల నూతన జాతీయ కార్యవర్గాన్ని నియమించిన విషయం తెలిసిందే. తెలంగాణ బీజేపీ నాయకులు చిన్న చిన్న విషయాలకు కూడా ఢిల్లీకి ఫిర్యాదులు చేస్తారని రాజాసింగ్ ఆరోపించారు. అందుకే జాతీయ కార్యవర్గంలో తెలంగాణ నాయకులకు చోటు దక్కలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా గ్రూప్ రాజకీయాలను పక్కనబెట్టి కలసికట్టుగా పనిచేయాలని హితవు పలికారు.

## కోల్‌కతాలో అగ్ని ప్రమాదం.. 9 మంది మృతి

**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** కోల్‌కతాలోని ఒక హోటల్‌లో బుధవారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఒక చిన్నారితో సహా కనీసం తొమ్మిది మంది మరణించారు. నగరంలోని అత్యంత రద్దీగా ఉండే న్యూ మార్కెట్ సమీపంలోని ఫ్రీ స్కూల్ స్ట్రీట్‌లో తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో మంటలు చెలరేగాయి. దీంతో భవనంలో పలువురు అతిథులు చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఈ అగ్నిప్రమాదంలో మరణించిన వారిలో బంగ్లాదేశ్ జాతీయులు కూడా ఉన్నారు. హోటల్‌లో కనీస అగ్నిమాపక భద్రతా చర్యలు లేవని ప్రాథమిక విచారణలో తేలింది. కోల్‌కతా పోలీసులు కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న హోటల్ యజమాని, సిబ్బంది కోసం గాలింపు చర్యలు చేపట్టారు.



## 9 ఏళ్ల బాలికపై హత్యాచారం



**అక్షరటుడే, మహారాష్ట్ర:** మహారాష్ట్రలోని పూణే జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. 9 ఏళ్ల బాలికపై లైంగిక దాడి చేసి ఓ వ్యక్తి హత్య చేశాడు. బాలిక మంగళవారం అనారోగ్య కారణాలతో పాఠశాలకు వెళ్లలేదు. మధ్యాహ్న సమయంలో నిందితుడు ఆమెపై అత్యాచారం చేసి, ఆపై గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని వాగు సమీపంలో పడేశాడు. ఇంట్లో బాలిక కనిపించకపోవడంతో, కుటుంబ సభ్యులు, బంధువులు వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ ఫుటేజీ ఆధారంగా బాధితురాలి ఇంటి సమీపంలో ఉండే సాహిల్ ఖైరేను నిందితుడిగా గుర్తించిన పోలీసులు అరెస్ట్ చేశారు.



## ఎమ్మెల్యేలకు సీఎం విజయ్ వరాలు

**అక్షరటుడే, చెన్నై :** తమిళనాడు సీఎం విజయ్ ఎమ్మెల్యేలకు వరాలు ఇచ్చారు. కారు, ఇంధన భత్యం, మెరుగైన ఆరోగ్య బీమా సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. మొత్తం 234 మంది ఎమ్మెల్యేలకు ఒక కారుతో పాటు ఇంధనం, నిర్వహణ ఖర్చుల కోసం భత్యం ఇస్తామన్నారు. డ్రైవర్, ఇంధనం, కార్ల నిర్వహణ ఖర్చుల కోసం ఎమ్మెల్యేలకు నెలకు రూ. 75,000 భత్యాన్ని కూడా విజయ్ ప్రభుత్వం ప్రకటించింది. అధికారిక పనుల కోసం కార్యదర్శిని (సెక్రటరీ) నియమించుకోవడానికి రూ. 25,000 గ్రాంట్ కూడా లభిస్తుంది. ప్రజా ప్రతినిధులకు వర్తించే ఆరోగ్య బీమా పరిమితిని రూ. 5 లక్షల నుండి రూ. 25 లక్షలకు పెంచుతున్నట్లు పేర్కొంది.

## ఎస్పీ లీడర్ ఆజంఖాన్ యూనివర్సిటీపై ఈడీ దాడులు



**అక్షరటుడే, ఢిల్లీ :** సమాజ్‌వాది పార్టీ నాయకుడు ఆజం ఖాన్‌కు చెందిన ట్రస్ట్, యూనివర్సిటీపై ఈడీ దాడులు చేసింది. మనీ లాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా బుధవారం పది ప్రాంతాలలో సోదాలు నిర్వహించింది. ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్, సహారన్‌పూర్, ఢిల్లీలోని వివిధ ప్రాంతాలలో ఈడీ అధికారులు దాడులు చేశారు. ఆజం ఖాన్‌కు చెందిన మౌలానా మహమ్మద్ అలీ జౌహర్ ట్రస్ట్, మహమ్మద్ అలీ జౌహర్ యూనివర్సిటీ ప్రాంగణాల్లో కూడా సోదాలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ కాంట్రాక్టు నిధులను ప్రైవేట్ కాంట్రాక్టర్ల ద్వారా మళ్లించడం, అనంతరం వాటిని యూనివర్సిటీ, ట్రస్ట్ ఆస్తుల సృష్టి వంటి పనులకు వినియోగించడం వంటి ఆరోపణలు ఆయనపై నమోదు అయ్యాయి.

## గేదె కోసం భార్య హత్య.. జీవిత ఖైదు విధించిన కోర్టు



**అక్షరటుడే, బీహార్:** కట్నం కింద గేదె, మోటార్‌సైకిల్ ఇవ్వాలని ఓ వ్యక్తి తన భార్యను వేధించాడు. అంతేగాకుండా ఆమెను హత్య చేశాడు. ఈ కేసులో కోర్టు నిందితుడికి జీవిత ఖైదు విధించింది. బీహార్‌కు చెందిన రీనా దేవిని ఆమె భర్త సుభాష్ యాదవ్ హత్య చేశారు. కట్నం కింద గేదె, బైక్ ఇవ్వకపోవడంతో అతడు ఈ దారుణానికి పాల్పడ్డాడు. నిందితుడు ఆమె మృతదేహాన్ని కాల్చి, మూడు ముక్కలుగా నరికి, వేర్వేరు సంచులలో పారవేశాడు. రీనా తల్లి మంజు దేవి ఫిర్యాదు మేరకు, ధనహా పోలీసులు 2020 జూలై 30న కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ చేపట్టిన పశ్చిమ చంపారన్ జిల్లా కోర్టు నిందితుడికి జీవిత ఖైదు విధించింది.